సాక్షి శ్రీకాకుళం

సోమవారం ၊ 4 ၊ మార్చి ၊ 2024



కల్యాణ వైభోగమే..

మందస వాసుదేవుని బ్రహ్మోత్సవాల్లో ఆదివారం స్వామి కల్యాణం జరిగింది. క్రతువును ఘనంగా నిర్వహించారు. - 8లో



పింఛన్ల పంపిణీ 95.67%

జిల్లా వ్యాప్తంగా మూడో తేదీ నాటికి 95.67 శాతం పింఛన్ల పంపిణీ జరిగింది. వలంటీర్లు సమయానికి పింఛన్లు అందిస్తున్నారు.

కొనసాగుతున్న టెట్

ఎచ్చెర్ల క్యాంపస్: జిల్లాలో గత నెల 27న ప్రారంభమైన ఏపీ టెట్- 2024 ఆన్‌లైన్ పరీక్షలు రెండు పరీక్ష కేంద్రాల్లో కొనసాగుతున్నాయి. ఆదివారం చిలకపాలెం శ్రీశివానీ ఇంజినీరింగ్ కాలేజ్‌లో మొదటి షిఫ్టులో 100కి 95, రెండో షిఫ్టులో 100కి 93 మంది, ఎచ్చెర్ల శ్రీవెంకటేశ్వర ఇంజినీరింగ్ కాలేజ్‌లో ఒక్క షిఫ్టులో పరీక్షలు జరగ్గా 140కి 128 మంది హాజరయ్యారు. ఇప్పటివరకు మొత్తం 2468 మందికి 2244 మంది హాజరయ్యారు. ఈ నెల ఆరో తేదీ వరకు పరీక్షలు జరగనున్నాయి.

న్యూస్‌రీల్


చీడివలసలో కార్డన్ సెర్చ్



చీడివలసలో కార్డన్ సెర్చ్ కార్యక్రమం నిర్వహిస్తున్న పోలీసులు

పోలాకి: మండలంలోని చీడివలస గ్రామంలో ఆదివారం పోలీసులు కార్డన్ సెర్చ్ కార్యక్రమం నిర్వహించారు. పోలాకి ఎస్ఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో వేకువజామున 50 మంది సిబ్బందితో గ్రామానికి చేరుకున్నారు. ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరించారు. అనుమానితులపై ఆరా తీశారు. రికార్డులు సరిగా లేని బైక్‌లను స్టేషన్‌కు తరలించారు. నరసన్నపేట సీఐ ప్రసాదరావు కార్డన్‌సెర్చ్ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

ఉద్దానంలో ఎలుగు సంచారం



గడూరు పరిసరాల్లో సంచరిస్తున్న ఎలుగు

వజ్రపుకొత్తూరు రూరల్: ఉద్దాన ప్రాంతంలో గల గడూరు గ్రామ పరిసర ప్రాంతంలో ఆదివారం ఎలుగు సంచరించడంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. ఉద్దాన ప్రాంత ప్రజల జీవనాధారమైన జీడి పంట పూత దశలో ఉండటంతో తోటలకు కంచెల ఏర్పాటు, పురుగు మందుల పిచికారీ చేసేందుకు రైతులు జీడి తోటలకు వెళ్తున్నారు. అయితే ఇటీవల గడూరు ప్రాంతంలో ఎలుగు దాడి చేసి ముగ్గురు వ్యక్తులను గాయపరిచింది. అలాగే వజ్రపుకొత్తూరు, కిడిసింగి తదితర గ్రామాల్లో ఎలుగులు దాడితో రైతులు మృత్యువాత పడ్డారు. దీంతో రైతులు జీడి తోటలకు వెళ్లేందుకు భయపడుతున్నారు. అలాగే రాత్రి వేళల్లో గ్రామ వీధుల్లో ఎలుగులు సంచరించడంతో ప్రజలు ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. అటవీశాఖాధికారులు స్పందించి ఎలుగు సంచారాన్ని నియంత్రించాలని వారు కోరుతున్నారు.

జీడి పంట దగ్ధం



కాలిపోయిన జీడి పంట

వజ్రపుకొత్తూరు రూరల్: మండలం బాతుపురం, రాజాం పరిసర తోటల్లో ఆదివారం జరిగిన అగ్ని ప్రమాదంలో సుమారు 3 ఎకరాల జీడి పంట పాక్షికంగా దగ్ధమైంది. బాతుపురం గ్రామానికి చెందిన జీడి రైతు పి.దేవదాసు తన జీడి తోట సాగులో భాగంగా ఆకులకు నిప్పు పెట్టి మంటలను అదుపు చేసి భోజనానికి ఇంటికి వచ్చేశారు. అయితే కొద్ది సేపటికి అక్కడక్కడ ఉన్న నిప్పురవ్వలు గాలికి ఎగిరి ఎండుటాలకులపై పడటంతో ఈ ప్రమాదం చోటు చేసుకున్నట్లు బాధితులు తెలిపారు. ఈ ప్రమాదంలో బాతుపురంలో ఏడుగురు రైతులకు చెందిన 3 ఎకరాల పూత దశలో ఉన్న జీడి పంట కాలిపోయింది. అటుగా వెళ్తున్న వలంటీర్ పసుపురెడ్డి కల్యాణ్ చొరవతో పెను ప్రమాదం తప్పినట్లు వారు తెలిపారు. అగ్ని ప్రమాదాన్ని గుర్తించిన వలంటీర్ తన తోటి స్నేహితులకు సమాచారం అందించి మంటలను అదుపు చేశారు.

ఉత్సాహంగా జిల్లా పురుషుల కబడ్డీ జట్టు ఎంపిక

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాస్థాయి సీనియర్స్ పురుషుల కబడ్డీ జట్టు ఎంపికలు ఆదివారం ఉత్సాహంగా సాగాయి. శ్రీకాకుళం జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నగరంలోని బలగ సమీపంలో ఉన్న నాగావళి నదీతీరాన జరిగిన ఈ ఎంపికలకు జిల్లా నలుమూలల నుంచి 78 మంది క్రీడాకారులు హాజరై తమ ప్రతిభను నిరూపించుకున్నారు. ఇక్కడ ఎంపికచేసిన క్రీడాకారులను నెల్లూరు వేదికగా ఈనెల 8 నుంచి 10వ తేదీ వరకు జరిగే 70వ ఏపీ రాష్ట్ర స్థాయి సీనియర్స్ పురుషుల కబడ్డీ చాంపియన్‌షిప్ పోటీలకు పంపిస్తామని జిల్లా కార్యదర్శి అకేని చిరంజీవిరావు వెల్లడించారు. త్వరలో తుది జాబితాను ప్రకటిస్తామని ఆయన పేర్కొన్నారు. అంతకుముందు జరిగిన ఈ ఎంపికలను శివప్రియ చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధి రెడ్డి చిరంజీవిరావు ఈ ఎంపికలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎం.శివాజీ, ఎం.నీలాద్రి, టి.ఈశ్వరరావు, సీహెచ్ రామకృష్ణ, ఎండి కృష్ణ, సీహెచ్ జగదీష్, మాధవరావు, లక్ష్మయ్య, బి.రామకృష్ణ, బి.కృష్ణ, సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.



ఆమదాలవలస: మొణంగివీధిలో పోలియో చుక్కలు వేస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం



పోలాకి: మబగాంలో చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న ధర్మాన కృష్ణదాస్



సోంపేట: బారువలో చిన్నారికి చుక్కలు వేస్తున్న జెడ్పీ చైర్ పర్సన్ పిరియా విజయ

98.45%

- జిల్లాలో పోలియో చుక్కల ప్రక్రియకు విశేష స్పందన
- నేడు, రేపు కూడా మిగిలిన చిన్నారులకు పోలియో చుక్కలు

అరసవల్లి: జిల్లా వ్యాప్తంగా ఆదివారం నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. రికార్డు స్థాయిలో 98.45 మందికి పోలియో చుక్కలు వేయడం విశేషం. జిల్లా వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో ఆశ వర్కర్లు, ఏఎన్ఎం తదితర సిబ్బంది అంతా క్షేత్ర స్థాయిలో రద్దీగా ఉండే అన్ని ప్రాంతాల్లోనూ ఈ శిబిరాలను ఏర్పాటు చేసి చిన్నారులకు పోలియా డ్రాప్స్ వేశారు. జిల్లా కేంద్రంలో ఈ కార్యక్రమాన్ని కలెక్టర్ మనజీర్ జిలాని, ఆయన భార్య మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ తమీమ్ అన్సారియాలు స్థానిక సంతోషిమాత ఆలయం వద్ద కార్యక్రమాన్ని లాంఛనంగా ఆదివారం ఉదయం ప్రారంభించారు. ఈ సందర్భంగా ముందుగా వారి పిల్లలకే పోలియో చుక్కలను వేశారు. కలెక్టర్ మాట్లాడుతూ పోలియో చుక్కలు తప్పనిసరిగా వేయించాలని, ఈ విషయంలో నిర్లక్ష్యం పనికి రాదని అన్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ బి.మీనాక్షి, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ ఎస్.ఈశ్వరి పాల్గొన్నారు.

98.45 శాతం నమోదు

జిల్లాలో మొత్తం 0–5 వయస్సులోపు ఉన్న చిన్నారులు 1,79,983 మంది ఉండగా, ఆదివారం ఒక్క రోజులో 47 పీహెచ్‌సీలు, 19 ట్రైబల్ పీహెచ్‌సీలు, 15 అర్బన్ పీహెచ్‌సీల పరిధిలో మొత్తం 1,77,194 మంది చిన్నారులకు పోలియో చుక్కలను వేశారు. దీంతో 98.45 శాతం లక్ష్యం పూర్తయ్యింది. అయితే మిగిలిన వారికి కూడా పోలియో డ్రాప్స్ వేసేందుకు సోమవారం, మంగళవారం కూడా కార్యక్రమాన్ని కొనసాగిస్తామని జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ బి.మీనాక్షి తెలియజేశారు.



చిన్నారులకు పోలియో చుక్కలను వేస్తున్న కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ దంపతులు

యంత్రముగ్ధమైన ఆలోచన

- జిల్లాస్థాయి ఈఎండీపీ వైజ్ఞానిక ప్రదర్శనలో మెరిసిన సింగుపురం జెడ్పీహెచ్ స్కూల్ విద్యార్థులు
- హోటల్ సర్వింగ్ రోబోట్‌తో ప్రయోగం
- రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం రూరల్ మండలంలోని సింగుపురం జెడ్పీహెచ్ స్కూల్ విద్యార్థుల 'యంత్ర'ముగ్ధమైన ఆలోచన రాష్ట్రస్థాయి వరకు వెళ్తోంది. స్కూల్‌కు చెందిన టి.సుశాంత్, ఆర్.కిరణ్ కుమార్, ఎ.హటకేశం మంచం పట్టిన వృద్ధులు, రోగులు, మోకాళ్ల నొప్పులతో సతమతమయ్యే వారికి హోటల్ రోబోట్ ద్వారా సేవలు అందించే మార్గాన్ని వివరిస్తూ ఓ ప్రాజెక్టు తయారు చేశారు. వారి ఆలోచనలకు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కె.తిరుమలదేవి బాసటగా నిలిచారు. సైన్స్ ఉపాధ్యాయురాలు గేదెల భాగ్యలక్ష్మి తోడుగా నిలిచి నిరంతరం ప్రోత్సహించారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఈనెల ఒకటో తేదీన జిల్లా విద్యాశాఖ అధికారుల ఆధ్వర్యంలో జరిగిన జిల్లాస్థాయి వ్యవస్థాపక మనస్తత్వ అభివృద్ధి కార్యక్రమం (డీఎండీపీ) వైజ్ఞానిక ప్రదర్శనలో వీరి ప్రాజెక్టు మొదటి స్థానంలో నిలిచింది. కమిషనర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో అమెజాన్ సహకారంతో నిర్వహించిన ఈ పోటీల్లో విజేతగా నిలవడంతో రాష్ట్రపోటీలకు ఎంపికయ్యారు.



ఆర్జేడీ జ్యోతికుమారి, డీఈఓ వెంకటేశ్వరరావు, తదితరుల చేతులమీదుగా బహుమతి, ప్రశంసా పత్రాలు అందుకుంటున్న జెడ్పీహెచ్ స్కూల్ సింగుపురం విద్యార్థులు, గైడ్ టీచర్ భాగ్యలక్ష్మి



తాము తయారుచేసిన రోబోట్ ప్రాజెక్టుతో సైన్స్ టీచర్ జి.భాగ్యలక్ష్మి, విశ్రాంత డీవైఈఓ కె.అప్పారావు, విద్యార్థులు

ఎలా పనిచేస్తుందంటే..

ఆండ్రాయిడ్ మొబైల్‌లో బ్లూటూత్ ద్వారా పెయిర్ అవుతుంది. ఆ తర్వాత దాన్ని ఆపరేట్ చేయాలి. పది మీటర్ల వరకు పనిచేస్తుంది. ముఖ్యంగా సర్వ్ చేయడం. మోకాళ్ల నొప్పులు, ఒళ్లు నొప్పులు ఉన్న వారికి రోబోట్ చాలా ఉపయుక్తంగా ఉంటుంది. ఆహారపదార్థాలు, వస్తువులను తీసుకెళ్తుంది. నడవలేని వారు, రోగులు, మంచాన పడినవారు రోబోట్‌ను ఆపరేట్ చేయడం ద్వారా సర్వీసింగ్ చేసుకోవచ్చు. మనతోపాటు సమీపంలో ఉన్నవారికి కూడా సర్వీస్ చేయించుకోవచ్చు.

వినూత్న ఆలోచన..



పాఠశాల విద్యార్థుల వినూత్న ఆలోచన మమ్మల్ని ఎంతగానో ఆకట్టుకుంది. పాఠశాల తరఫున అన్ని విధాలుగా సహకరించాం. సైన్స్ టీచర్ నిరంతరం పిల్లల్ని ప్రోత్సహిస్తూ పరిశోధనల వైపు ఆకర్షితులను చేస్తున్నారు. హోటల్ సర్వీసింగ్ రోబోట్ ప్రస్తుత రోజుల్లో అవసరం కూడా.

– కె.తిరుమలాదేవి, హెచ్ఎం, జెడ్పీహెచ్‌స్కూల్ సింగుపురం

ఈ ప్రాజెక్టు ఎంతో అవసరం



ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఈ రోబోట్‌లు ఎంతో అవసరం. ఆండ్రాయిడ్ సెల్‌ఫోన్‌లో బ్లూటూత్ ద్వారా పనిచేస్తుంది. కొంచెం ఖర్చుతో కూడినది అయినప్పటికీ ఇళ్లలో వృద్ధులకు ఉపయోపగడుతుంది. విద్యార్థులు ప్రత్యేకంగా శ్రద్ధ చూపడంతో ప్రాజెక్టును తీర్చిదిద్ది ప్రదర్శించాం. మొదటిస్థానంలో నిలిచాం. రాష్ట్రపోటీలకు ఎంపిక కావడం సంతోషంగా ఉంది.

– గేదెల భాగ్యలక్ష్మి, సైన్స్ టీచర్, జెడ్పీహెచ్‌స్కూల్ సింగుపురం

గంజాయి గ్యాంగ్ ఘాతుకం

- టాస్క్‌ఫోర్స్ వాహనాలను ఢీకొట్టి తప్పించుకున్న వైనం
- ఎస్ఐతో పాటు మరో ఇద్దరికి తీవ్రగాయాలు
- రెండు టోల్‌గేట్లు దాటి పీఎం పాలెంలో పోలీసులకు చిక్కిన దుండుగులు
- 380 కిలోల గంజాయి పట్టివేత



కంటైనర్‌లో దొరికిన గంజాయి





గంజాయి ముఠా ఢీకొట్టడంతో గాయాలపాలైన టాస్క్‌ఫోర్స్ పోలీసులు

శ్రీకాకుళం క్రైమ్, కాశీబుగ్గ: ఆదివారం వేకువజామున 3 గంటల సమయం. పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని నెమలినారాయణపురం సమీపంలోని జాతీయ రహదారి. చీకట్ల మధ్య రహదారిపై మూడు బైక్‌లతో పోలీసులు కాచుకుని ఉన్నారు. ఓ ముప్పై నిమిషాలు గడిచాక ఓ కంటైనర్ వ్యాను వేగంగా దూసుకువచ్చింది. పోలీసులు అంత వేకువజామున కాపు కాసింది ఆ వాహనాన్ని ఆపడానికే. కానీ ఆ బండి పోలీసుల బైక్‌లు చూసి ఆపినట్టే ఆపి అమాంతం వాటిని ఢీకొట్టి వెళ్లిపోయింది. ఓ ఎస్ఐ సహా ఇద్దరు కానిస్టేబుళ్లకు గాయాలయ్యాయి. ఏదో క్రైమ్ థ్రిల్లర్ సినిమాలోలా జరిగిన ఈ ఘటనతో పలాస ఉలిక్కిపడింది. పోలీసుల నుంచి తప్పించుకునేందుకు గంజాయి గ్యాంగ్ చేసిన నిర్వాకమిది. వివరాల్లోకి వెళితే..

గొప్పిలి మీదుగా పలాస జాతీయ రహదారికి చేరి అక్కడి నుంచి విశాఖపట్నం వెళ్లే డీసీఎం కంటైనర్‌లో గంజాయి తరలిస్తున్నారన్న సమాచారం ఉండటంతో ఎస్ఐ జి.ప్రభాకర్ సహా మరో ఐదుగురు టాస్క్‌ఫోర్స్ కానిస్టేబుళ్లు ఆదివారం ఉదయం నెమలినారాయణపురం వద్ద మాటువేశారు. కంటైనర్ రావడంతో అడ్డంగా ద్విచక్ర వాహనం పెట్టారు. కంటైనర్ ఆపగా బండిని తనిఖీ చేయాలని, తాము పోలీసులమని కంటైనర్ డ్రైవర్‌తో చెప్పారు. దీంతో ఆ డ్రైవర్ బండిని వెనక్కి తీస్తున్నట్లు తీసి ఒక్కసారిగా ముందుకు పోనిచ్చాడు. దీంతో బైక్‌పై ఉన్న కానిస్టేబుల్ తుళ్లిపోయాడు. ఆయనకు ముందు ఉన్న ఎస్ఐ ప్రభాకర్, మరో కానిస్టేబుల్ కూడా గాయపడ్డారు. హెల్మెట్లు పెట్టుకుని ఉండడంతో ప్రాణాపాయం తప్పింది. ఎస్ఐ ప్రభాకర్, కానిస్టేబుళ్లు బి.సురేష్, ఎం.సంతోష్‌కుమార్‌కు గాయాలయ్యాయి. వీరిని వెంటనే పలాస ప్రభుత్వాస్పత్రికి తరలించి రాత్రి 3.30కు ఎస్పీ రాధికకు సమాచారం అందించారు. ఆమె వెంటనే జిల్లా పోలీసు యంత్రాంగాన్ని అలర్ట్ చేశారు. క్షతగాత్రులను శ్రీకాకుళంలోని మెడికవర్‌కు తరలించారు.

జిల్లా అంతా అప్రమత్తం

ఎస్పీకి సమాచారం తెలిసిన వెంటనే హైవే మొబైల్ పెట్రోలింగ్, నైట్ రౌండ్ బీట్ల వాహనాల వారిని, జిల్లాలో ఉన్న చెక్‌పోస్టులను, టెక్కలి, శ్రీకాకుళం డీఎస్పీలనే కాక ఆర్పీఎఫ్ వాళ్లను కూడా అప్రమత్తం చేశారు. డీసీఎం కంటైనర్‌ను ఆపేందుకు విశ్వప్రయత్నం చేశారు. అప్పటికే ఫాస్ట్‌ట్యాగ్ ఉండటంతో నరసన్నపేట టోల్‌ప్లాజాను కంటైనర్ అలవోకగా దాటేసింది. చిలకపాలెంలో టోల్‌గేట్ లేకపోవడం.. పైడి భీమవరం వరకు మన జిల్లా పరిధి కావడంతో కంటైనర్‌ను మనవాళ్లు ఛేజ్ చేసినా పట్టుకోలేకపోయారు.

పీఎంపాలెంలో పట్టివేత..

అప్పటికే విశాఖ సిటీ పోలీసులకు, చెక్‌పోస్టులకు, నాతవలస టోల్‌ప్లాజా ఎస్పీ సమాచారమిచ్చినా నాతవలస టోల్‌ప్లాజాను కూడా కంటైనర్ దాటి వెళ్లిపోయింది. అక్కడి నుంచి మరో మార్గంలో పీఎంపాలెంకు చేరుకోగానే అక్కడ పోలీసులు అడ్డుగా వెహికల్స్‌ను పెట్టి బండిని ఆపడంతో కంటైనర్‌లో ఉన్న డ్రైవర్, క్లీనర్ పక్కకు ఆపినట్లే ఆపి తుప్పల్లో దూకేసి అక్కడి నుంచి పరారయ్యారు. సినీ ఫక్కీలో జరిగిన ఈ ఘటనలో శ్రీకాకుళం జిల్లా పోలీసులు కష్టపడినా చివరికి కంటైనర్ విశాఖ పట్నం జిల్లా పీఎంపాలెంలో పోలీసులకు పట్టుబడటంతో కంటైనర్‌ను ఆదివారం మధ్యాహ్నం మూడు గంటలకు తెరిచారు. కంటైనర్‌లో ఉన్న 380 కిలోల గంజాయిని ఆదివారం సాయంత్రం స్వాధీనం చేసుకున్నారు.

క్షతగాత్రులకు పరామర్శ..

మెడికవర్‌లో చికిత్స పొందుతున్న ఎస్ఐ ప్రభాకర్, కానిస్టేబుళ్లు సంతోష్ కుమార్, సురేష్‌లను ఎస్పీ జీఆర్ రాధిక, అదనపు ఎస్పీ ప్రేమ్‌కాజల్ పరామర్శించారు. విధి నిర్వహణలో ప్రాణాలను సైతం ఫణంగా పెట్టినందుకు ప్రత్యేకంగా అభినందించారు.



పీఎం పాలెం వద్ద పోలీసులకు దొరికిన కంటైనర్

ఒక్క రోజులో రూ.11.40 లక్షల ఆదాయం



ప్రత్యేక దర్శన క్యూలలో కిక్కిరిసిన భక్తులు

అరసవల్లి: ప్రసిద్ధ అరసవల్లి సూర్యనారాయణ స్వామి సన్నిధిలో మాఘమాసం నాలుగో ఆదివారం సందర్భంగా ప్రత్యేక సందడి కనిపించింది. భారీగా భక్తులు తరలివచ్చి ఆదిత్యునికి మొక్కులు చెల్లించుకున్నారు. మరోవైపు వత్సవలస రాజులమ్మ జాతర సందర్భంగా ఆదివారం వేకువజాము నుంచే భక్తులు కుటుంబాలతో కలిసి రావడంతో ముందుగా అరసవల్లి ఆదిత్యుడిని దర్శించుకునేందుకు క్యూలైన్లలో బారులు తీరారు. గంటల కొద్దీ క్యూలైన్లలో ఉండి మరీ స్వామిని దర్శించుకున్నారు. మాఘమాసం కావడంతో పెద్ద సంఖ్యలో మహిళలు ఇంద్రపుష్కరిణి ఆవరణలో ప్రత్యేక పూజలు చేశారు. ఆదివారం ఉదయం 5.30 గంటల నుంచే సర్వదర్శనాలకు అనుమతించారు. ఒక్క రోజులోనే మొత్తంగా రూ.11,40,167 ఆదాయం లభించింది. ఇందులో వివిధ దర్శనాల మార్గాల టిక్కెట్ల విక్రయాల ద్వారా రూ.6,50,600, విరాళాలు, ఆర్జిత సేవల ద్వారా రూ.1,59,567, లడ్డూ, పులిహోర ప్రసాదాల విక్రయాల ద్వారా రూ.3.30 లక్షల ఆదాయం లభించినట్లుగా ఆలయ సూపరింటెండెంట్ కృష్ణమాచార్యులు తెలియజేశారు.

రాజమ్మ తల్లి సంబరాలకు పోటెత్తిన భక్తులు



వత్సవలస వీధిలో భక్తులు

గార: వత్సవలసలో కొలువైన రాజమ్మ తల్లి (రాజరాజేశ్వరి) దర్శనానికి భక్తులు రెండో వారం పోటెత్తారు. శనివారం రాత్రే వచ్చిన భక్తులు ఇక్కడే బస చేసి ఆదివారం ఉదయం మొక్కులు తీర్చుకున్నారు. వేకువ జామున సమీపంలోని సముద్రంలో స్నానాలాచరించారు. ఉత్సవంలో కోళ్లు, గొర్రెలు సమర్పించడంతో పాటు కానుకలు అధికంగా భక్తులు ముట్టజెప్పారు. శ్రీకూర్మం కూడలి వద్ద నుంచి తూలుగు, ఎర్రగుడ్డి మీదుగా మళ్లీ శ్రీకూర్మం వరకు వన్‌వే ఏర్పాటు చేయడంతో ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలగలేదు.

ఘన స్వాగతం



ఉద్దానం ప్రాంత ప్రజల రైలు ప్రయాణ అవసరాలను తీర్చే విశాఖ–బరంపురం ప్యాసింజర్ రైలుకు మొదటిసారి ఆదివారం రాత్రి సోంపేటలో హాల్ట్ కల్పించారు. ఈ పాసింజర్‌కు జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్‌లు ఘనంగా స్వాగతం పలికారు. లోకోపైలెట్‌కు పూలబొకే ఇచ్చి ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు రైలెక్కి ఇచ్ఛాపురం వరకు ప్రయాణించారు. ఈ రైలు ఈ ప్రాంతాల్లో ఆగడం వల్ల స్థానికులకు విశాఖ రాకపోకలకు వీలుగా ఉంటుందన్నారు. ఇతర ముఖ్యమైన రైళ్లకు కూడా ఇక్కడ హాల్టు కల్పించేలా కృషి చేస్తామన్నారు.



– కంచిలి, ఇచ్ఛాపురం

6న మెగా జాబ్‌మేళా

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా ఉపాధి కల్పనాధికారి కార్యాలయం ఆధ్వర్యంలో ఈనెల 6వ తేదీన మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి కొత్తలంక సుధ తెలిపారు. శ్రీకాకుళం నగరంలోని బలగ హాస్పటల్ జంక్షన్‌లో ఉన్న డీఎల్‌టీసీ/ఐటీఐ శిక్షణా కేంద్రం వేదికగా బుధవారం ఉదయం 10.30 గంటలకు నిర్మాణ్ సంస్థ వారి సహకారంతో ఈ జాబ్‌మేళా మొదలవుతుందని చెప్పారు. అపోలో ఫార్మసీ లిమిటెడ్, నవత రోడ్ ట్రాన్స్‌పోర్ట్, డెక్కన్ ఫైన్ కెమికల్స్, ఫ్లిప్‌కార్ట్, అరబిందో ఫ్రైసెస్ ప్రైవేట్ లిమిటెడ్, నియో లింక్ కంపెనీ, ముత్తూట్, హీరో మోటార్స్, టాటా క్యాపిటల్స్, ఫ్యూచర్ ప్రాపర్టీ పొల్యూషన్, సుస్వదీప్ ఆగ్రో సర్వీస్ తదితర కంపెనీల్లో 693 ఉద్యోగాల భర్తీ కోసం ఈ మెగా జాబ్‌మేళాను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. టెన్త్, ఇంటర్, ఐటీఐ, డిప్లమో, డిగ్రీ, ఇంజినీరింగ్ తదితర కోర్సులు కలిగి 18 నుంచి 40 ఏళ్ల వయస్సు కలిగిన స్త్రీ, పురుషులు జాబ్‌మేళాకు హాజరు కావచ్చని కొత్తలంక సుధ చెప్పారు. ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు హాజరుకావాలని ఆమె కోరారు.

15 కిలోల గంజాయి పట్టివేత

ఇచ్ఛాపురం: ఒడిశా నుంచి వచ్చిన ఇద్దరు వ్యక్తుల వద్ద నుంచి 15 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నామని సీఐ టి.ఇమ్మాన్యుయేల్ రాజు తెలిపారు. పట్టణ పోలీస్‌స్టేషన్ ఆవరణంలో ఆదివారం సాయంత్రం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. ఆదివారం ఒడిశా నుంచి వచ్చిన బస్‌లో దిగిన ఇద్దరు వ్యక్తులు మళయాళం మాట్లాడుకుంటూ రైల్వేస్టేషన్‌కి వెళ్తున్నారు. అయితే వీరి కదలికలపై పోలీసులకు ముందుగానే సమాచారం అందింది. దీంతో ఇన్‌చార్జి రూరల్ ఎస్ఐ ఎస్.లక్ష్మణరావు వీరిని ఆపి తనిఖీ చేశారు. దీంతో రెండు బ్యాగుల్లో 15 కిలోల గంజాయి దొరికింది. వీరు ఒడిశా నుంచి కేరళకు గంజాయిని అక్రమంగా రవాణా చేస్తున్నట్లు తెలిపారు. వీరి వద్ద నుంచి గంజాయి, రెండు సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. అలాగే ఇద్దరినీ అదుపులోకి తీసుకున్నారు. నిందితులను కేరళలోని తిరుమందస్ జిల్లా పుత్తంబేడుకి చెందిన కుత్తన్ నాదార్ సత్యాన్, తిరువనంతపురం జిల్లా, తెరివిలా గ్రామానికి చెందిన శిబుదాసాన్‌లుగా గుర్తించారు.



ప్రెస్‌మీట్‌లో మాట్లాడుతున్న సీఐ ఇమ్మాన్యుయేల్ రాజు, ఎస్ఐ లక్ష్మణ్‌రావు

కల్యాణ వైభోగమే..


కల్యాణోత్సవంలో కోలాటం

మందస: వాసుదేవుడి పెళ్లికి ఊరంతా అతిథులయ్యారు. మందసలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామి కల్యాణం కడు రమణీయంగా నిర్వహించారు. ఆగమ శాస్త్రరీతిలో స్వామి పరిణయాన్ని వేద పండితులు జరిపించారు. త్రిదండి దేవనాథరామానుజ జీయర్‌స్వామి ప్రత్యక్ష పర్యవేక్షణలో ఆలయ ప్రధాన అర్చకులు గోపినంబాళ్ల దాసుకూర్మాచార్యులు, వేదపండితులు, అర్చకులు క్రతువు నిర్వహించారు. పూబంతులాట, పుష్పమాల నృత్యాలు, కట్నచదివింపులు సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. రాష్ట్ర పశు సంవర్ధక, పాడిపరిశ్రమ, మత్స్యశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు, శ్రీదేవి దంపతులు వాసుదేవుని దర్శించుకోగా.. అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం మంత్రి సీదిరి దంపతులు స్వామి కల్యాణంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి అప్పలరాజు ఆలయ అభివృద్ధికి రూ.లక్ష అందజేశారు. స్వామి ఆశీస్సులు ఈ ప్రాంతంపై ఉంటాయని అన్నారు. ఈ సందర్భంగా అండాళ్లగోష్ఠి, మహిళల కోలాటం ఆకట్టుకున్నాయి. భగవంతునికి నిర్దీత రూపం లేదని, వాక్కు, మనస్సునకు అందని అతీతుడని త్రిదండి దేవనాథరామానుజ జీయర్ స్వామి అభివర్ణించారు. రాత్రి గరుడ వాహనసేవలో కల్యాణ దంపతులైన శ్రీభూ సమేత వాసుదేవుని మందస పురవీధుల్లో ఊరేగించారు.


తాళిబొట్లు చూపిస్తున్న అర్చకులు, వేదికపై మంత్రి సీదిరి అప్పలరాజు దంపతులు


కల్యాణం తిలకిస్తున్న భక్తులు

108 మందితో సూర్యనమస్కారాలు

అరసవల్లి: ఆరోగ్యక్షేత్రం అరసవల్లి శ్రీసూర్యనారాయణ స్వామి సన్నిధిలోని అనివెట్టి మండపంలో సూర్యప్రణవ పతంజలి యోగ విద్యా సంఘం ఆధ్వర్యంలో 108 మంది మహిళలతో సామూహిక సూర్యనమస్కారాల కార్యక్రమం జరిగింది. ఆదివారం సాయంత్రం జరిగిన కార్యక్రమంలో ఆలయ ఈఓ డీఎల్‌వీ రమేష్‌బాబు, ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ, సంస్థ అధ్యక్షురాలు తంగి స్వాతి, పడాల భూదేవి, యోగా గురువులు ఎంవి.రామారావు, రిటైర్డ్ జడ్జి పప్పల జగన్నాథరావు, నాగేశ్వరరావు, బొడ్డేపల్లి దక్షిణామూర్తి, సంఘ కార్యదర్శి ఎస్.సుధారాణి, కోశాధికారి పి.కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.


సామూహిక సూర్యనమస్కారాలు చేస్తున్న మహిళలు

క్లుప్తంగా

ఘనంగా శ్రీశైల మల్లన్న తలపాగా ఊరేగింపు


ఊరేగింపులో శివ సాధువేషధారణలు

శ్రీకాకుళం కల్చరల్: ఫాజుల్ బాగ్ పేటలోని దేవాంగుల వీధిలో శ్రీశైల మల్లికార్జునస్వామికి అందజేయనున్న తలపాగాను ఆదివారం గ్రామంలో ఘనంగా ఊరేగించారు. 365 మూరల తలపాగాను ఈనెల 5న గౌరీ వినాయక కమిటీ ఆధ్వర్యంలో అందజేసేందుకు బయల్దేరుతామని నిర్వాహకులు తెలిపారు. తూతిక వెంకటరావు నిర్వహణలో తలపాగాను శివరాత్రి రోజుకు అందించడం చాలా ఏళ్లుగా ఆనవాయితీగా వస్తోంది. ఈ సందర్భంగా ఫాజుల్‌బాగ్ పేట పురవీధుల్లో కోలాటాలు, శివ సాధువుల వేషధారణలతో మల్లన్న తలపాగాను ఊరేగించారు.

జీఎన్‌ఆర్ గోల్డ్, డైమండ్స్ షాపు ప్రారంభం


గోల్డ్ షాపు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

నరసన్నపేట: స్థానిక వైఎస్సార్ కూడలిలో ఆదివారం జీఎస్‌ఆర్ గోల్డ్, డైమండ్స్ షాపును ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ ఆదివారం ప్రారంభించారు. ఇలాంటి షాపులు నరసన్నపేటలో మరిన్ని ఏర్పాటు కావాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. బంగారం వ్యాపారంలో నరసన్నపేటకు జిల్లాలోనే మంచి పేరు ఉందని, దీన్ని నిలబెట్టుకొని వ్యాపారాభివృద్ధి చేసి నరసన్నపేట ఖ్యాతిని ఇనుమడింపజేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో గుడ్ల నాగరాజు, జెడ్పీటీసీ చింతు అన్నపూర్ణ, నరసన్నపేట సర్పంచ్ బూరల్లి శంకర్, గుప్త తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి కబడ్డీ విజేత కొండూరు


విజేత జట్టు కొండూరుకు నగదు, షీల్డ్‌ను అందజేస్తున్న ధనుంజయ్‌కుమార్

సంతబొమ్మాళి: గొదలాం గ్రామంలో నందన్న ఆలయ 56వ వార్షికోత్సవం సందర్భంగా జరిగిన జిల్లా స్థాయి కబడ్డీ పోటీల్లో విజేతగా కొండూరు జట్టు నిలిచింది. ఆదివారం జరిగిన ఫైనల్‌లో కొండూరు, శివరాంపురం జట్లు తలపడ్డాయి. విజేతగా నిలిచిన కొండూరు జట్టుకు రూ. 15వేలు, రెండో స్థానంలో నిలిచిన శివరాంపురం జట్టుకు రూ. 10వేలు, మూడో స్థానంలో నిలిచిన బాడపల్లి జట్టుకు రూ. 8వేలు, 4వ స్థానంలో నిలిచిన గొదలాం జట్టుకు రూ. 7వేలు నగదుతో పాటు షీల్డ్‌ను జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు పిలక ధనుంజయకుమార్ చేతుల మీదుగా అందజేశారు.

ఘనంగా ఆదిత్యుని తిరువీధి


వెండి సింహవాహనంలో ఊరేగుతున్న ఆదిత్యుని ఉత్సవమూర్తులు

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి తన దేవేరులతో ఆదివారం సాయంత్రం ఆలయ మాడవీధుల్లో వెండి సింహవాహనంపై కాసేపు విహరించారు. మాఘమాసం నాల్గో ఆదివారం సందర్భంగా శ్రీ ఉషా పద్మిని ఛాయా దేవేరులతో శ్రీవారి ఉత్సవమూర్తులకు పూర్తి అలంకరణతో వేదమంత్రోచ్ఛరణలు, మంగళధ్వనుల మధ్య తిరువీధి నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో ఈఓ డీఎల్‌వీ రమేష్‌బాబు సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమంలో వందలాది మంది భక్తులు హాజరయ్యారు. దీంతో ఆలయ పరిసరాలు కిటకిటలాడాయి.

ఉత్తరాంధ్ర మహిళా సంఘ కరపత్రం ఆవిష్కరణ

కాశీబుగ్గ: పలాస మండలం బొడ్డపాడు గ్రామంలో అమర వీరులస్మారక భవనం వద్ద ఆదివారం ఉత్తరాంధ్ర మహిళా సంఘం కరపత్రం ఆవిష్కరించారు. ఈనెల 8న శ్రామిక మహిళా దినోత్సవ స్ఫూర్తిని కొనసాగిస్తామంటూ ఉత్తరాంధ్ర మహిళా సంఘం కరపత్రాలు పంచిపెట్టి ఆవిష్కరణ చేశారు. కార్యక్రమంలో పి.నాగమణి, యు.జ్యోతి, ఆదిలక్ష్మి, వెంకటమ్మ, పి.బాను తదితరులు పాల్గొన్నారు.

శిష్టకరణాలకు అండగా ఉంటాను

- శిష్టకరణ సంక్షేమ సంఘం భవనం ప్రారంభోత్సవంలో మంత్రి ధర్మాన


శిష్టకరణ సంఘ భవన ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): తన రాజకీయ జీవితం ఆరంభం నుంచి శిష్టకరణాలు ఎప్పుడూ తన వెంటే ఉన్నారని, వారికి ఎప్పుడూ అండగా ఉంటానని రాష్ట్ర రెవెన్యూ శాఖమంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. శ్రీకాకుళం మహాలక్ష్మి నగర్ కాలనీలో నూతనంగా నిర్మించిన శ్రీకాకుళం నగర శిష్టకరణ సంక్షేమ సంఘ భవనాన్ని మంత్రి ప్రారంభించి, సంబంధిత కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తమ ప్రభుత్వం అన్ని కులాలకు సమ ప్రాధాన్యత ఇస్తోందని చెప్పారు. ఇదివరకు అక్షరాస్యతలో మన రాష్ట్రం దేశంలో 22వ స్థానంలోఉండేదని, సీఎం వైఎస్ జగన్ విధానాల వల్ల మూడో స్థానానికి చేరుకుందని, అక్షరాస్యత శాతం కూడా 97 శాతం ఉందని చెప్పారు. వైఎస్ జగన్ పాలన కొనసాగితే వందశాతం అక్షరాస్యత సాధ్యమవుతుందని పేర్కొన్నారు. పద్నాలుగేళ్లు సీఎంగా పనిచేసిన చంద్రబాబు ఒక్క వెనుకబడిన కులానికైనా మేలు చేశారా అని ప్రశ్నించారు. రాజధానిలో రియల్ ఎస్టేట్ వ్యాపారం తప్ప చంద్రబాబుకు చిన్న కులాల వారి బాధలు తెలియవని అన్నారు. అనంతరం శిష్టకరణ సంఘ ప్రతినిధులు మంత్రి ధర్మానను సత్కరించారు. ఈ సందర్భంగా కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి మాట్లాడుతూ సంఘ భవన నిర్మాణానికి తాను కేంద్ర మంత్రిగా ఉన్నప్పుడు రూ.5లక్షలు ఇచ్చానని చెప్పారు. మున్సిపల్ మాజీ ఛైర్ పర్సన్ మెంటాడ పద్మావతి మాట్లాడుతూ శిష్ట కరణాలను ఓబీసీలో చేర్చే విషయమై మంత్రి ధర్మాన ఎప్పటి నుంచో తమకు సహకరిస్తున్నారని తెలిపారు.

శిష్టకరణాలను ఓబీసీ జాబితాలో చేర్చేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీ రామ్మోహన్‌నాయుడు, మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి, శిష్టకరణ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు పోలుమహంతి ఉమామహేశ్వరరావు, సదాశివుని కృష్ణ, ఆర్.వి.ఎస్ శర్మ, డీఆర్వో దయానిధి, డబ్బీరు వాసు,రెడ్ క్రాస్ సంస్థ ఛైర్మన్ పోలుమహంతి జగన్మోహనరావు, డాక్టర్ శ్రీనివాస్ పట్నాయక్, రామచంద్రరావు, ఆరికతోట కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

'ఉచిత వైద్య సేవలు వినియోగించుకోవాలి'


మందులు అందిస్తున్న కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

శ్రీకాకుళం కల్చరల్: ప్రజలంతా ఉచిత వైద్యసేవలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలానీ సమూన్ కోరారు. స్థానిక పాతబస్టాండు వద్ద గల మగటపల్లి కల్యాణ్ నేత్రసేకరణ కేంద్రంలో ఉన్న రెడ్‌క్రాస్ మెడిసిన్ బ్యాంక్‌లో ఉచిత మెగా వైద్యశిబిరాన్ని ఆదివారం ఆయన, విశిష్ట అతిథి మున్సిపల్ కమిషనర్ ఎ.తమీమ్ అన్సారియాలు ప్రారంభించారు. ప్రముఖ వైద్యుల సహకారంతో సోమవారం నుంచి శనివారం వరకు నిర్వహిస్తున్న వైద్యసేవలను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని కలెక్టర్ కోరారు. అక్కడ అందుతున్న వైద్యసేవలను, వైద్యపరికరాల కోసం అడిగి తెలుసుకున్నారు. ముందుగా రెడ్ క్రాస్ ఫౌండర్ హెన్రీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం సేవలందిస్తున్న రెడ్‌క్రాస్ ఛైర్మన్ జగన్మోహనరావును, డాక్టర్ పిఎల్ఎన్‌రాజు, డాక్టర్ ధర్మాన లక్ష్మీనారాయణ, డాక్టర్ దినేష్‌కాంత్ ఉదయాన, డాక్టర్ ప్రేమ్ సర్కారీ, డాక్టర్ ఎస్.చంద్రశేఖర్, డాక్టర్ ఉదయాన కిరణ్‌కాంత్, డాక్టర్ బటారం అరుణ్‌కుమార్ గుప్తా, డాక్టర్ ఎస్.వెంకట రాజేష్, డాక్టర్ కె.ప్రసన్నలక్ష్మి, డాక్టర్ జె.నిఖితలను దుశ్శాలువలతో సత్కరించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ కారదర్శి బి.మల్లేశ్వరరావు, డీపీఆర్ఓ కె.బాలమాన్‌సింగ్, ప్రజారోగ్య పరిరక్షణ కమిటీ సభ్యులు కల్యాన్, యువజన అవార్డు గ్రహీత పెంకి చైతన్య, బి.సతీష్‌కుమార్, సుజాత, పవన్, తదితర సభ్యులు పాల్గొన్నారు.

'జీడికి మద్దతు ధర ఇవ్వాలి'


ప్రసంగిస్తున్న విమలక్క

పలాస: జీడి పిక్కలను పండించే రైతులకు కనీస మద్దతు ధర ప్రభుత్వం ప్రకటించాలని, 80కిలోల జీడి పిక్కల బస్తాకు రూ.16వేలు చెల్లించాలని, రైతు భరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేయాలని రైతు సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. కాశీబుగ్గ పెట్రోలు బంకు సమీపంలోని ఆచల గురు ఆశ్రమంలో ఆదివారం జీడి పిక్కల మద్దతు ధర కోరుతూ రైతుల సదస్సును నిర్వహించారు. ఈ సదస్సులో ఉభయతెలుగురాష్ట్రాల అరుణోదయ గౌరవ అధ్యక్షురాలు విమలక్క ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. జీడి మద్దతు ధర విషయంలో గతం నుంచి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ధర విషయంలో జీడి వ్యాపారుల దయాదాక్షిణ్యాలపై వదిలేయడం సరికాదన్నారు. రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు కోనేరు గురయ్య అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జీడి రైతు సంఘం జిల్లా కన్వీనరు తెప్పల అజయ్‌కుమార్, వివిధ ప్రజాసంఘాల నాయకులు కె.వీరాంజనేయులు, బి.రమేష్, ఎస్.నారాయణరావు, టి.భాస్కరరావు, డిల్లీరావు తదితరులు పాల్గొన్నారు.

అర్ధ శతాబ్దం అనంతరం..



శ్రీకాకుంలోని పీఎస్ఎన్ఎం హైస్కూల్‌లో 1975లో చదువుకున్న వారు ఆదివారం మళ్లీ కలిశారు. దాదాపు అర్ధ శతాబ్దం తర్వాత మళ్లీ కలవడంతో ఆనాటి స్మృతులు గుర్తు చేసుకున్నారు. 2021లో పదవీ విరమణ పొందిన అప్పటి సోషల్ స్టడీస్ టీచర్ కె.శ్రీరాములును ఘనంగా సత్కరించారు.
- శ్రీకాకుళం కల్చరల్

'వన్యప్రాణులను కాపాడుకుందాం'


వన్యప్రాణుల వేషధారణలో మండపల్లి తోటూరు విద్యార్థులు

ఇచ్ఛాపురం రూరల్: వన్యప్రాణులను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని ఎం.తోటూరు ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుహాస్‌చంద్ అన్నారు. ఆదివారం ప్రపంచ వన్యప్రాణుల దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రాథమిక పాఠశాల విద్యార్థులతో వన్యప్రాణుల వేషధారణలో ఏకాంకిక నాటికను ప్రదర్శించారు. కార్యక్రమంలో విద్యార్థులు ఉల్లాసంగా పాల్గొన్నారు.

ఆస్పత్రికి వెళ్లి పింఛన్ అందజేత


రాజారావుకు పింఛన్ అందిస్తున్న వలంటీర్ స్వాతి

నందిగాం: మండలంలోని స్వామిపేటకు చెందిన వలంటీర్ బద్రి స్వాతి ఆదివారం శ్రీకాకుళం రిమ్స్‌కు వెళ్లి పింఛన్ అందజేసి తన సేవాగుణాన్ని చాటుకున్నారు. నందిగాం పంచాయతీ స్వామిపేటకు చెందిన బద్రి రాజారావు కాలు విరిగిపోవడంతో శ్రీకాకుళం రిమ్స్‌లో శస్త్రచికిత్స చేసుకొని వైద్య సేవలు పొందుతున్నారు. ఆయనకు పింఛన్ ఇవ్వాల్సి ఉండడంతో వలంటీర్ స్వాతి ఆస్పత్రికి వెళ్లి మరీ పింఛన్ అందజేశారు.

ఘనసరలో ఏనుగుల సంచారం

భామిని: మండలంలోని ఘనసర చుట్టు పక్కల ఏనుగుల గుంపు ఆదివారం సంచరించింది. ఈ సందర్భంగా పచ్చని పంటలను పాడుచేస్తూ తినివేశాయి. రోడ్ల మీదకు వచ్చిన ప్రయాణికులను భయభ్రాంతులకు గురిచేశాయి. పాత ఘనసర, కీసర, కోసలి మధ్య రోడ్డుపై నాలుగు ఏనుగుల గుంపు రెండుగా విడిపడి రోడ్ల వెంబడి తిరుగాడడంతో ప్రజలు ఆందోళనకు గురయ్యారు. వాటిని గమనించిన గ్రామస్తులు పరుగుపెట్టారు. పంట పొలాలకు వెళ్లిన రైతులు భయంతో ఇంటి ముఖం పట్టారు.

'సూదికొండను మంత్రి రక్షించారు'


పార్టీలో చేరిన సూదికొండ యువకులతో రాష్ట్ర మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలో జీడి కార్మికులు అత్యధికంగా జీవిస్తున్న సూదికొండ ప్రాంతం వైఎస్సార్ సీపీదేనని సూదికొండ యువత అన్నారు. మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు క్యాంప్ కార్యాలయంలో ఆదివారం కొందరు యువకులు వైఎస్సార్ సీపీలో చేరారు. ఓ నాయకుడు సూదికొండను సగం తవ్వేశారని, ఇంకో నాయకుడు తవ్వేద్దామని చూస్తున్నాడని ఇవన్నీ తెలుసుకున్న రాష్ట్ర మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు సూదికొండను కాపాడారని వారు అన్నారు. ఈ సందర్భంగా సుమారు 40 మంది యువకులను మంత్రి సాదరంగా వైఎస్సార్ సీపీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో వార్డు కౌన్సలర్ శిష్టు బృందావతి, పార్టీ జిల్లా కార్యదర్శి బడగల బల్లయ్యనాయుడు, అధికార ప్రతినిధులు శిష్టు గోపి, గుజ్జు జోగారావు తదితరులు పాల్గొన్నారు.

'ఎల్లో మీడియా దుష్ప్రచారాన్ని నమ్మవద్దు'


వైఎస్సార్‌సీపీలో చేరిన వారికి కండువాలు వేసి ఆహ్వానిస్తున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

- మంత్రి ధర్మాన ప్రసాదరావు
- వైఎస్సార్ సీపీలో కళింగ వైశ్యుల చేరిక

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): ప్రభుత్వంపై ఎల్లో మీడియా చేస్తున్న దుష్ప్రచారాన్ని నమ్మవద్దని రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు కోరారు. శ్రీకాకుళంలోని జిల్లా పరిషత్ వద్ద ఎంబజీ కాలనీలో గల అంబేడ్కర్ ఆడిటోరియంలో కళింగవైశ్యుల ఆత్మీయ సమావేశం సంఘ రాష్ట్ర అధ్యక్షులు కోణార్క్ శ్రీను అధ్యక్షతన ఆదివారం జరిగింది. వాంబేకాలనీ, మంగువారితోట, ఎంబజీ, ఎల్‌బజీ, కొత్తపేట ప్రాంతాలకు చెందిన సుమారు 100మందికిపైగా సంఘ యువజన విభాగం అధ్యక్షులు బరాటం సంతోష్ సమక్షంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మంత్రి ధర్మాన మాట్లాడుతూ కళింగ వైశ్యులను బీసీ జాబితాలో చేర్పించేందుకు కమిషన్ చైర్మన్‌కు సిఫార్సు చేసింది తానేనని, దివంగత వైఎస్సార్ హయాంలో ఇవన్నీ జరిగాయని దాన్ని టీడీపీ నేతలు రాజకీయ స్వలాభం కోసం వారు చేసినట్లు చెబుతున్నారని వాటిని నమ్మవద్దన్నారు. బాబుకి తన తాబేదారుల స్వలాభమే ఏకైక లక్ష్యమన్నారు. జిల్లాలో కిడ్నీ రీసెర్చ్‌సెంటర్, ఉద్దానం ప్రాంతానికి మంచినీటి ప్రాజెక్టు, మూలపేట పోర్టు, ఫిషింగ్‌హార్బర్, లిఫ్ట్ ఇరిగేషన్ వంటి అనేక అభివృద్ధి పనులు చేసింది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమేనని గుర్తుచేశారు. తాము నిర్మించిన 80 అడుగుల రోడ్డులోనే ఎంపీ రామ్మోహన్‌నాయుడు ఇల్లు కట్టుకుని అభివృద్ధి జరగదలేని అనడం దారుణమన్నారు. పేదల కోసం సేకరించిన భూమిని చంద్రబాబునాయుడు అప్పనంగా తీసుకుని టీడీపీ కార్యాలయం నిర్మించుకున్నారని తెలిపారు. రూ.500కోట్లుతో భూమిని కొనుగోలు చేసి 20వేల మందికి ఇళ్ల పట్టాలు అందించిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డిదని అన్నారు. జిల్లా నుంచి ఎచ్చెర్లను విడగొడతామంటే సీఎంకు చెప్పి మీ అందరి ప్రయోజనాలకోసం జిల్లాలో ఉంచి అనేక పరిశ్రమలు, విద్యాసంస్థలను కాపాడుకోగలిగామన్నారు.

వీలైనంత తొందరలో పూర్తిచేసిన ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్‌ని ప్రారంభించి అన్ని ప్రభుత్వ కార్యాలయాల సేవలను ఒకే చోట అందిస్తామన్నారు. అవినీతి రహిత పాలన అందిస్తున్న వైఎస్సార్ సీపీని మళ్లీ గెలిపించాలని కోరారు. పార్టీలో చేరిన వారిలో రిటైర్డ్ ఎమ్మార్వో సింహాద్రి ఆంజనేయులు, శిల్లా చందు, బరాటం గోవిందరావులతో పాటు అధిక సంఖ్యలో మహిళలు, వృద్ధులు, యువకులు ఉన్నారు. కార్యక్రమంలో కళింగవైశ్యులు ఊన్న నాగరాజు, వైశ్యరాజు మోహన్, అంధవరపు సంతోష్, అంధవరపు సంతోష్, గుడ్ల మల్లేశ్వరరావు, గుడ్ల దామోదరరావు, అంధవరపు రామా, అంధవరపు కొండబాబు తదితరులు పాల్గొన్నారు.

చివరి దశకు కమిటీ నివేదికలు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో గ్రీవెన్స్ సెల్ ఫిర్యాదులపై వచ్చిన అంశాల విచారణకు నియమించిన కమిటీల నివేదికలు చివరి దశకు చేరుకున్నాయి. ఫిబ్రవరి నెల చివరి నాటికి నివేదికలు సమర్పించాలని వీసీ కేఆర్ రజిని ఆదేశించారు. ప్రధానంగా 34 ఔట్ సోర్సింగ్ ఉద్యోగాల అక్రమ నియామకాలు అంశంపై డాక్టర్ ఎస్.ఉదయ్‌భాస్కర్ కమిటీ, 24 మంది టీచింగ్ ఫ్యాకల్టీ తొలగింపు, నచ్చిన వారిని కొనసాగించటంపై డాక్టర్ కె.స్వప్నవాహిణి కమిటీ, వర్సిటీ ఏర్పాటు నుంచి వర్సిటీలో టీచింగ్, నాన్ టీచింగ్ అన్ని విధానాల్లో నియమించిన పోస్టుల నిబంధనలపై డాక్టర్ ఎం.అనురాధ కమిటీ నియమించారు. ఈ కమిటీల నివేదికపై త్వరలో పాలక మండలి సమావేశంలో చర్చించి, స్టాండింగ్ కమిటీ సూచనలు, సలహాలు తీసుకొని ముందుకు సాగాలని వీసీ భావిస్తున్నారు. వర్సిటీలో పారదర్శకత, అవినీతి రహిత పాలన లక్ష్యంగా ముందుకు సాగాలన్న లక్ష్యంతో వీసీ ఉన్నారు. మరో పక్క రెగ్యులర్ రిజిస్ట్రార్ నియామకం పరిశీలిస్తున్నట్లు సమాచారం. ప్రస్తుతం వర్సిటీలో ఇన్‌చార్జి రిజిస్ట్రార్‌గా ప్రొఫెసర్ బిడ్డిక అడ్డయ్య కొనసాగుతున్నారు.